క్లుప్తంగా

ఇసుక ట్రాక్టరు పట్టివేత


పోలీసులకు పట్టుబడిన ఇసుక ట్రాక్టరు

తెర్లాం: మండలంలోని కూనాయవలస వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును పోలీసులు సోమవారం పట్టుకుని, కేసు నమోదు చేశారు. మెరకముడిదాం మండలంలోని సోమలింగాపురానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టరుతో ఇసుక తరలిస్తుండగా, అనుమతి పత్రాలు చూపించాలని కోరగా, ఆయన స్పందించకపోవడంతో ఇసుక అక్రమ రవాణాగా భావించి, వాహనాన్ని సీజ్ చేశామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. ఇసుక రీచ్‌ల నుంచి ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శిక్షణా తరగతుల వాయిదా

బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సోమవారం నుంచి నిర్వహించాల్సిన శిక్షణా తరగతులు వాయిదా వేసినట్లు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. గ్రామ పంచాయతీల్లో విధులు, బాధ్యతలు, అభివృద్ధిపై నాలుగు రోజుల పాటు శిక్షణా తరగతులు ఇచ్చేందుకు నిర్ణయించామని, ప్రస్తుతం ఈ తరగతులను ఈ నెల 9వ తేదీ నాటికి వాయిదా వేశామన్నారు. 9, 10వ తేదీల్లో జరిగే తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారదర్శకంగా పనులు చేపట్టాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: ఉపాధి హామీ పథకం పనులను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏపీవో విజయలక్ష్మి అధ్యక్షతన టీఏలు, ఎఫ్ఏల సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన.. గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, గుర్తించిన ఉపాధి పనులపై చర్చించారు. అనంతరం రైతులకు మేలు జరిగేలా పనులు ఉండాలని, గ్రామసభల్లో గుర్తించిన చోట పనులు చేయాలని తెలిపారు.

డిప్యూటీ తహసీల్దారుగా రాజశేఖర్




రాజాం: మండల డిప్యూటీ తహసీల్దారుగా ఎం.రాజశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డిప్యూటీ తహసీల్దారుగా సేవలందించిన వేంకటేశ్వరరావుకు పొందూరు రీసర్వే డిప్యూటీ తహసీల్దారుగా బదిలీ కాగా, పార్వతీపురం మన్యం జిల్లాలోని పాచిపెంట మండలం నుంచి రాజశేఖర్ ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం


ఉప్పర్నాయుడువలసలో ఆయుర్వేద వైద్యం అందిస్తున్న వైద్యుడు సునీల్‌కుమార్

రేగిడి: ఆయుర్వేద వైద్యం ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుందని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యుడు ఎస్.సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో ఆయుర్వేద వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. శిబిరానికి వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి ఆయన ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కీళ్లనొప్పులు, వాతనొప్పులు, రక్తపోటు, మధుమేహం, చర్మవ్యాధులతో బాధపడుతున్న వారికి ఆయుర్వేద వైద్యంలో మంచి మందులు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్ఐను కలిసిన వీఆర్‌ఏలు


రామారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్‌ఏలు

వంగర: మండల తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐ బోనెల రామారావును వీఆర్‌ఏల సంఘం సోమవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఆయన ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో వీఆర్‌ఏలంతా ఆయనను కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించి, స్వాగతం పలికారు. గతంలో ఇక్కడ వీఆర్‌వోగా పనిచేసి, బదిలీపై వెళ్లి తిరిగి ఆర్ఐగా మళ్లీ ఇక్కడకే రావడం చాలా సంతోషంగా ఉందని వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు యజ్జల అప్పలస్వామి అన్నారు.

మహనీయుల బాటలో నడవాలి



అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలు ఆవిష్కరించి, నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రామభద్రపురం: రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ప్రముఖ సంఘసంస్కర్త, రాజకీయవేత్త డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వంటి గొప్ప మహనీయుల బాటలో అందరూ నడవాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఆరికతోటలో దాతలు పెంకి చినఅప్పలస్వామి(విశ్రాంత ఉపాధ్యాయుడు), పెంకి భీమయ్య(మాజీ సర్పంచ్), పెంకి జార్జి ఎబినేజర్(విశ్రాంత డిప్యూటీ డీఈవో), పెంకి సుధాకర్(ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు)లు ఏర్పాటు చేసిన అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆయన సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయా విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ విభిన్న కులాలు, మతాలు, జాతుల వారు ఉన్న మనదేశంలో ప్రజలంతా ఐక్యంగా ఉన్నారంటే దానికి కారణం అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ వంటి మహానుభావులే కారణమన్నారు. మనదేశం ఇప్పటికీ ఇంత స్వేచ్ఛగా, సురక్షితంగా ఉండడానికి కారణం వారిద్దరేనన్నారు. రాజ్యాంగం రూపంలో దేశానికి అంబేడ్కర్ పటిష్టమైన పునాది వేశారన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం వారిద్దరూ ఎంతగానో కృషి చేశారన్నారు. దేశ ప్రజల హృదయాల్లో వారిద్దరు ఎప్పటికీ చిరస్మరణీయులుగానే ఉంటారన్నారు. వారి మేధాశక్తి, పరిజ్ఞానంతో దళిత, గిరిజన వర్గాల వారిని సమాజంలోని ఇతర వర్గాలతో సమాన స్థాయికి తీసుకురావడానికి పరితపించారన్నారు. వారి జ్ఞానం కేవలం ఏదో ఒక అంశానికి మాత్రమే పరిమితం కాదని ఆర్థిక, రాజకీయ, సామాజిక, న్యాయశాస్త్రాల న్నింటిలోనూ వారికి అపారమైన జ్ఞానం ఉందని కొనియాడారు. విద్యార్థులు, యువత గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు తెలుసుకుని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యుడు అప్పికొండ సరస్వతి, సర్పంచ్ పెంకి పుష్పమ్మ, వైస్ ఎంపీపీ పెంకి అరుణ, నాయకులు పెంకి శేఖర్‌బాబు, బాడంగి జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయులు, ధర్మారావు, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

తస్మాత్ జాగ్రత్త


మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: దసరా సెలవులకు ఊరు వెళ్తున్నారా.. అయితే తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని సీఐ నారాయణరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో సోమవారం ఆయన మాట్లాడుతూ దొంగతనాలను అరికట్టడానికి లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టంను వినియోగించుకోవాలని తెలిపారు. డబ్బు, విలువైన ఆభరణాలను ఇంట్లో ఉంచి వెళ్లవద్దని, రాత్రివేళ అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల గురించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తాళం వేసిన ఇళ్లను ఉదయం వేళల్లో అపరిచిత వ్యక్తులు గమనిస్తుంటారని, రాత్రిపూట చోరీకి ప్రయత్నిస్తారన్నారు. విలువైన వస్తువులను పొరుగింటి వారికి ఇవ్వకుండా తమ ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పి వెళ్లడం మంచిదన్నారు. అలాగే దేవీ నవరాత్రి ఉత్సవాల్లో కూడా జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా తగాదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుర్గాదేవి విగ్రహ అనుపోత్సవంలో ఈత వచ్చిన వారు మాత్రమే చెరువుల వద్దకు వెళ్లాలని, ఈత రానివారు, చిన్నపిల్లలు నిమజ్జనం చేసే ప్రదేశానికి వెళ్లవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

బొబ్బిలి: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని బొడ్డు వారి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన దేవీ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, ఎస్.రామకృష్ణ తదితరులు అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీవో కనకదుర్గ

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో ఉన్న 3, 4 అంగన్‌వాడీ కేంద్రాల్లో రాజాం ఐసీడీఎస్ పీవో కనకదుర్గ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, సరుకుల నిల్వల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రాలకు వస్తున్న చిన్నారుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి, తక్కువ బరువు ఉన్న పిల్లలపై దృష్టిసారించాలని ఆమె సూచించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా సక్రమంగా అందజేయాలని తెలిపారు. కేంద్రాల నిర్వహణ బాగుండడంతో కార్యకర్తలు ఎం.వసంతలక్ష్మి, వి.మణిలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దశపర్ణి కషాయంతో చీడపీడల నివారణ


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: దశపర్ణి కషాయంతో వరి పంటకు సోకే చీడపీడలు నివారించవచ్చని ఏవో జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని ఆయన తెలిపారు. ప్రకృతి సాగులో భాగంగా తయారయ్యే ద్రావణాలు, కషాయాలతో వరి పంటకు సోకే దోమపోటు, కుళ్లు తెగుళ్లను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీలు వై.తవిటినాయుడు, కె.రమణ, టి.గోవిందమ్మ, ఎస్.శ్రీలత, సర్పంచ్ కరణం గోవిందరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

- సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ

బొబ్బిలిరూరల్: మహిళలకు తమ హక్కులు, సంరక్షణకు సంబంధించి, ప్రస్తుతం అమలులోని చట్టాలపై అవగాహన తప్పనిసరిగా అవసరమని మండల లీగల్ సెల్ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ అన్నారు. విధాన్ సే సమాధాన్ పథకంలో భాగంగా మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో న్యాయ అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత, హక్కులకు ఎటువంటి భంగం కలిగినా న్యాయస్థానాలు ఆశ్రయించి, న్యాయం పొందవచ్చన్నారు. జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళా చట్టాలు, హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించాలని తెలిపారు. పని ప్రదేశంలో మహిళలకు తగిన గౌరవం ఇవ్వాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే మహిళలు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పలుపత్ర ద్రావణం తయారీపై అవగాహన


పలుపత్ర ద్రావణం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో పలుపత్ర ద్రావణం తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. ఐసీఆర్‌పీలు కరణం వరలక్ష్మి, పాగిరి లక్ష్మంనాయుడు, గుండాల రవిలు పలుపత్ర ద్రావణం తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, చూపారు. వేప, కానుగ, ఉమ్మెత్త, జిల్లేడు, మారేడు, వెదురు, వావిలాకు, రావి, మందార, కలబంద, తూటికాడ ఆకులు, తులసి, అత్తాకోడల్లాకు, వెంపలాకులు సేకరించి, వాటిన్నంటినీ ద్రావణంగా తయారు చేసుకుని పంటలపై పిచికారీ చేస్తే తెగుళ్లు, చీడపీడలు సోకవన్నారు. ఈ ద్రావణం మొక్కల ఎదుగుదలకు, శిలీంద్రనాసినిగా కూడా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శాసపు గోవిందనాయుడు, ఎంపీటీసీ పుర్లి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి


తహసీల్దారుకు సమస్యను వివరిస్తున్న విజయరాంపురం రైతులు

బొబ్బిలిరూరల్: భూ సమస్యను పరిష్కరించాలని మండలంలోని గొర్లెసీతారాంపురం పంచాయతీ పరిధిలోని విజయరాంపురం గ్రామ రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమానికి వెళ్లి, తహసీల్దారు ఎం.శ్రీనును కలిసి తమ సమస్యను వివరించారు. గత 30 ఏళ్లుగా గ్రామంలోని సర్వే నంబరు139లో 134 మందికి ప్రభుత్వం ఇచ్చిన భూపట్టాలపై తమ పేర్లు లేవని, ఆన్‌లైన్‌లో చూస్తే అది ప్రభుత్వ భూమిగా చూపిస్తోందన్నారు. దీంతో ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు, సదుపాయాలను కోల్పోతున్నామని వాపోయారు. అదే భూమిని జిరాయితీగా మార్చి అప్పటి వీఆర్‌వో, తహసీల్దార్లు అమ్మకాలు చేసేశారని, దానిపై సీబీసీఐడీ కేసు కూడా ఉండగా, ప్రభుత్వం భూమిగా చూపుతోందన్నారు. స్పందించిన తహసీల్దారు.. సీబీసీఐడీ నుంచి ఎన్‌వోసీ తెచ్చుకుంటే సమస్యను పరిష్కరించగలమని, కేసులు ఉంటే ఏమీ చేయలేమని తేల్చి చెప్పారు. ఉన్నతాధికారులతో చర్చించి, న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తానన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు


మెంటాడ: మాట్లాడుతున్న ఎంపీపీ సన్యాసినాయుడు

మెంటాడ: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు కోరారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిక్షణలో పంచాయతీలో విధులు, బాధ్యతలు, అధికారాలు, నిర్వహణ, విధివిధానాలు, అభివృద్ధిలో భాగస్వామ్యం, పాత్ర వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతోందని, వాటిని బాగా నేర్చుకుని గ్రామాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ఎంపీడీవో కూర్మనాథ్ మాట్లాడుతూ మండలంలోని 31 పంచాయతీల్లో తొలుత 16 పంచాయతీల్లోని ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజులు, మరుసటి రెండు రోజులు మిగతా 15 పంచాయతీల్లోని ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో భానుమూర్తి, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, రత్నాకర్‌నాయుడు, ఈవోపీఆర్‌డీ విమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యులే కీలకం..

రాజాం: పంచాయతీల అభివృద్ధిలో వార్డు సభ్యులే కీలకమని ఎంపీపీ లావేటి సులోచన అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండలంలోని పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు సోమవారం నిర్వహించారు. రిఫ్రెషర్‌లో భాగంగా ఈ తరగతులు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 21 పంచాయతీల నుంచి 60 మంది వార్డు సభ్యులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు తదితరులు పాల్గొని, గ్రామాభివృద్ధికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

అభివృద్ధిపై దృష్టిసారించాలి..

రేగిడి: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులంతా దృష్టిసారించాలని ఎంపీడీవో శ్యామలాకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండురోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ఆమె సోమవారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీలకు వస్తున్న నిధులతో గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, పంచాయతీల అభివృద్ధిలో వారి పాత్రను ఆమె వివరించారు.

ఎన్నికల హామీలు అమలు చేయాల్సిందే..


మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రామభద్రపురం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందేనని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. నిధులు లేవనే సాకు చూపి, సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసగించడం మంచిది కాదన్నారు. పథకాల అమలు నుంచి ప్రజల దృష్టి మళ్లించడమే ప్రధాన లక్ష్యంగా తిరుమల లడ్డూ ప్రసాదం వివాదం తెరపైకి తెచ్చి, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు. హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పించుకోవడానికి ప్రయతిస్తే ప్రజలు తిరగబడే రోజులొస్తాయని హెచ్చరించారు. ఇప్పటికే అమలు చేయాల్సిన పథకాలు అమలు చేయకపోవడంతో ఆ పథకాల ఆశావహులంతా ఆగ్రహంతో ఉన్నారన్నారు. అలాగే ప్రస్తుతం నిత్యవసర ధరల పెరుగుదలతో లక్షలాది పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలపై అదనపు భారం పడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటుతున్నా ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. పంటలు సరిగా పండక.. అటు రైతులు, సంక్షేమ పథకాలు అందక ఇటు పేద ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్న తరుణంలో పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు వారికి గుదిబండలా మారాయన్నారు.

గతంలో కొద్దోగొప్పో ధరలు పెరిగితే ఇదే చంద్రబాబు బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారని, ఇప్పుడు ఆయనే ముఖ్యమంత్రి కదా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ధరల నియంత్రణకు చర్యలు చేపట్టి, పేదలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీవీ సూర్యనారాయణరాజు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయులు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధి పనులకు భూమిపూజ


రామభద్రపురంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం: మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం అగురు, గొల్ల వీధుల్లో మంచినీటి కుళాయిలను ఆయన ప్రారంభించి, కాసేపు మాట్లాడారు. నియోజకవర్గంలోని తెర్లాం, బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి మండలాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.26 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. శ్రీరామ్‌నగర్ కాలనీ ప్రజలకు తాగునీటి అవస్థలు లేకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఉపసర్పంచ్ చింతల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో రేగి రాంబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సోమవారం సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేయించాలన్నారు. అలాగే గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రజలను నిత్యం అందుబాటులో ఉండి, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కోరారు.

వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు


బాడంగి ఉమాసోమేశ్వరాలయంలో మహాచండి అవతారంలో ఉమాదేవి


తెర్లాం: నందబలగ కనకదుర్గ ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవారు


వంగర: రుషింగిలో మహాచండి అవతారంలో అమ్మవారు


రాజాంలోని గాంధీనగర్‌లో చాముండేశ్వరీదేవి అవతారంలో దుర్గమ్మ

దేవీ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. రోజుకో అవతారంలో దర్శనమిచ్చే దుర్గాదేవిని చూసి తరించేందుకు భక్తజనం ఆలయాలు, మండపాలకు పోటెత్తుతున్నారు. సోమవారం చాముండేశ్వరీ దేవి అలంకరణలో కనిపించిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. వేడుకల్లో భాగంగా చేపడుతున్న పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

– బొబ్బిలి, రాజాం


రాజాం సిటీ: రాజాం పట్టణ పరిధిలోని సారథిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళా భక్తులు

వరి పంటను ఆశించిన సుడిదోమ


సుడిదోమ సోకిన వరి పంట

రాజాం: మండలంలోని ఆగూరు, బొద్దాం, నందబలగ, గురవాం తదితర ప్రాంతాల్లోని వరి పంటను సుడిదోమ తెగులు ఆశించి, పంట మొత్తం పాడైపోతోంది. పంట అంతా ఊదా రంగులోకి మారిపోతోంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇదే విషయంపై ఏవో రేణుకాసాయి వద్ద ప్రస్తావించగా పంటకు తెగుళ్లు సోకే సమయంలో రైతులు అప్రమత్తమై, దగ్గరలోని రైతుసేవా కేంద్రంలో ఉన్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది సూచనలతోనే పంటలపై పురుగుమందు పిచికారీ చేయాలని తెలిపారు.

బాడంగి: మండలంలోని పంటపొలాలను ఏవో కె.శిరీష సోమవారం పరిశీలించారు. అక్కడక్కడ పంటకు ఆకుముడత, పాముపొడ తెగుళ్లు సోకినట్లు గుర్తించినట్లు ఆమె తెలిపారు. ఆకుముడత తెగులు నివారణకు కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములను లీటరు నీటిలో, పాముపొడ తెగులు నివారణకు హెక్సాకొనజాల్ 2 మిల్లీ లీటర్లను లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. ఎకరా పంట విస్తీర్ణానికి 200 లీటర్ల ద్రావణం సరిపోతుందన్నారు.